http://www.agnidharanews.com
# అగ్నిధార
నిజాల నిప్పు కణిక
ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్
శుక్రవారం 16 అక్టోబర్ 2026
పేజీలు : 5 వెల : 5/-
Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## యాసంగిలో వరి పంట వేయొద్దు

తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సమస్య ఎదుర్కోబోతున్నాం
ఎల్‌నినో పరిస్థితులకు అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన



- రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరిక
- ఎల్‌నినో పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై సీఎం రేవంత్ రెడ్డి చర్చ
- అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు
- మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి
- కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలి

హైదరాబాద్

ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్రమే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని యాసంగి పంటలు తగ్గించుకోవాలని, ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోవాలని, పెద్ద మనసు చేసుకుని యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన - మిగతా 3లో

### ఢిల్లీలో సీజేపీ నిరసన..
## అడ్డుకోలేమన్న హైకోర్టు



- ఎన్నికల అవకతవకల ఆరోపణలపై సీజేపీ నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతి
- కన్నాట్ ప్లేస్‌లో ఆందోళనను నిలువరించాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- సీజేపీ ఆందోళనలో పాల్గొననున్న ఆమ్ ఆద్మీ పార్టీ
- ఇండియా కూటమి సైతం ఇదే అంశంపై పోరాటం



### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే
## ఉపేక్షించబోం

- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ సీఈపై సస్పెన్షన్ వేటు
- ఇన్‌ఛార్జులుగా ఐదుగురు ఐఏఎస్‌ల నియామకం
- యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు
- నిర్లక్ష్యంగా వ్యవహరించారని సీఈని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- విద్యుత్ అంతరాయాలపై సీఎం ఆగ్రహం

### 'సర్' వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 'స్పెషల్ సమ్మరీ రివిజన్'

- తెలుగు రాష్ట్రాలకు త్వరలో ప్రకటన
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై తీవ్ర వివాదం
- 17 రాష్ట్రాల్లో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు ఈసీ ఆదేశం
- 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎన్నికల సంఘం
- ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు తర్వాత షెడ్యూల్ ప్రకటన

## కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!



- త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.
- మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది
- ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు
- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది
- ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది.

హైదరాబాద్

తెలంగాణలో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వ పనితీరుకు పట్టభద్రుల తీర్పును మద్దతుగా మలచుకోవడంతో పాటు, రాబోయే రోజుల్లో రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం పావులు కదుపుతోంది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ తో పాటు నల్గొండ- వరంగల్- ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ ఉద్దేశంతో పార్టీ యంత్రాంగాన్ని - మిగతా 3లో



### లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి
- ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్ధరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయి
- దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదు
- ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది

### దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు





### కరెంట్ కోతలు..
## అధికారులపై నెపమా రేవంత్?

- బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడింది
- ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

## మనం చేసి చూపిద్దాం

- ఏషియన్ గేమ్స్ హీరోలకు ప్రధాని మోదీ కొత్త నినాదం
- ఆసియా క్రీడల పతక విజేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక భేటీ
- క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపిన ప్రధానమంత్రి
- భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్‌గా మారుస్తామని ఉద్ఘాటన
- క్రీడా మౌలిక వసతుల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం
- మహిళల హాకీ, క్రికెట్, కబడ్డీ జట్ల చారిత్రక విజయాలపై ప్రశంసలు



# దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది. ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.



**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.
2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్. ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
హాల్టులు: రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.
3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.
4. బీర్ -- ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

పొడిగించిన సర్వీసులు:

1. బాంద్రా (ట) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా -- వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా -- చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్--వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా--హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా--అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా--గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి--రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (ట)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ--కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
ఖు= బెంగళూరు--ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్--పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా--రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్
ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

## ‘సర్’ వివాదం.. 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ‘స్పెషల్ సమ్మరీ రివిజన్’..




దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ (సర్) ప్రక్రియపై చెలరేగుతున్న వివాదాల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ‘సర్’ నిర్వహణలో తలెత్తిన లోపాలను సరిదిద్దే లక్ష్యంతో, 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాకు “స్పెషల్ సమ్మరీ రివిజన్” (ఎస్ఎస్ఆర్) చేపట్టాలని గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఓటు హక్కు పొందే యువతతో పాటు, సాంకేతిక కారణాల వల్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారిని చేర్చేందుకు ఈ ప్రక్రియ దోహదపడనుంది. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, తమిళనాడు వంటి కీలక రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2027 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. తాజా షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 12న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 2027 జనవరి 4న తుది జాబితాను విడుదల చేస్తారు. కాగా, 2027 ఫిబ్రవరి నాటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది.

**వివాదానికి దారితీసిన సర్**

‘సర్’ ప్రక్రియలో భాగంగా భారీస్థాయిలో ఓటర్ల పేర్లను తొలగించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా, ఫారం-6తో పాటు ఓటర్లు ఒక అదనపు డిక్లరేషన్ సమర్పించాలన్న నిబంధన వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం జరిగిన ‘సర్’ వివరాలతో ప్రస్తుత దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వివరాలను అనుసంధానం చేయాలని కోరడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిబంధనలు అసంబద్ధంగా ఉన్నాయని, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేలా ఉన్నాయని ఆరోపిస్తున్నాయి. ఈ వివాదం నేపథ్యంలో ‘ఇండియా’ కూటమి పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వంటి యువజన సంఘాలు ఢిల్లీలో నిరసనలు చేపట్టాయి. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఏపీ, తెలంగాణలో పరిస్థితి ఏంటి?**

ప్రస్తుతం ‘సర్’ ప్రక్రియ కొనసాగుతున్న లేదా ఇటీవలే పూర్తయిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ‘ఎస్ఎస్ఆర్’ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అదేవిధంగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇప్పటివరకు ‘సర్’ ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లలో కూడా ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను తగిన సమయంలో వెల్లడిస్తామని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 29న ఇచ్చిన ఆదేశాల మేరకు, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్రాల అధికారులకు సూచించినట్లు ఈసీ గుర్తు చేసింది.

## లక్ష్యం నెరవేరింది.. నక్సలిజం ముగిసింది



నక్సలిజం బస్తర్ ప్రాంతంలో పూర్తిగా అంతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ 2026 మార్చి 31 గడువును విధించారని, భద్రతా బలగాల కృషితో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ‘సేవా సంకల్ప అభియాన్’ కార్యక్రమంలో భాగంగా, దివ్యాంగులు, నక్సల్ బాధితులకు సాయం అందించే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదని ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని చెప్పారు.

ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని షా చెప్పారు. నక్సలిజంలో మిగిలిన ఆనవాళ్లను కూడా పూర్తిగా తుడిచిపెట్టి, బస్తర్‌ను ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చడానికి కేంద్రం పట్టుదలతో ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్?పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం ప్రాథమిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కానీ, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల్లో సాధారణ స్థితి, గిరిజన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా వివరించారు.

“ఐదు దశాబ్దాల పాటు నక్సలిజం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో, బస్తర్?లోని పేద ఆదివాసులను ఏ స్థాయిలో నష్టపరిచిందో ప్రపంచం మొత్తం ఈ గణాంకాల ద్వారా తెలుసుకోగలదు. ఏదైనా ఒక నిర్దోషి అయిన పౌరుడిని, వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఐఈడీ బాంబులు అమర్చి వారి చేతులు, కాళ్లు విసిరేస్తే అంతకంటే పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన మరొకటి ఉండదు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఒక దృఢ సంకల్పం ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని చెప్పాం. అనుకున్నట్లుగానే ఈ రోజు దేశంలో నక్సలిజం అంతమైపోయిందని చెప్పడానికి నాకు ఎంతో ఆనందంగా ఉంది. నక్సలిజం వల్ల గత ఐదు దశాబ్దాలుగా ఆ ప్రజలు పడిన వేదనను మనం అంతం చేయలేం. ఆ బాధలు ఎవరినైతే గాయపరిచాయో, వారికి మనం ఓదార్పునివ్వాలి. వారిని నిలబెట్టేందుకు ప్రయత్నం చేయాలి. వారు ఆత్మగౌరవంతో జీవించేలా తగిన ఏర్పాట్లు చేయాలి.”

**వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్యఉద్దేశం**

‘సేవా సంకల్ప్? అభియాన్?’ కార్యక్రమం ద్వారా దాదాపు 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్? షా పేర్కొన్నారు. అక్టోబర్? 5 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క బస్తర్?లోనే 1,570 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నక్సలిజం కారణంగా అంగవైకల్యానికి గురైన గిరిజనులకు కృత్రిమ అవయవాలు అందిస్తుండటం పట్ల షా సంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలిజం ఐదు దశాబ్దాల పాటు ఛత్తీస్?గఢ్?ను ఎంతగా పీడించిందో అక్కడి వికలాంగుల సంఖ్యను బట్టి అంచనా వేయవచ్చునని షా పేర్కొన్నారు. నక్సలిజం వల్ల జీవితాలు ప్రభావితమైన వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఒకప్పుడు ఛత్తీస్?గఢ్? అభివృద్ధికి నక్సలిజం పెద్ద అడ్డంకిగా ఉండేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ ?సాయి పేర్కొన్నారు. అయితే, ప్రధాని మోదీ నాయకత్వంలో నక్సలిజం నిర్మూలన దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్రానికి దక్కిన గొప్ప ప్రయోజనాల్లో ఒకటని అన్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

# మనం చేసి చూపిద్దాం

భారతదేశం అనతికాలంలోనే అంతర్జాతీయ క్రీడారంగంలో తిరుగులేని శక్తిగా (గ్లోబల్ స్పోర్టింగ్ పవర్‌హౌస్) ఆవిర్భవించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు-2026లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన భారత క్రీడాకారులతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా “మనం చేసి చూపిద్దాం” అనే కొత్త నినాదంతో వారిలో స్ఫూర్తిని నింపారు. దేశంలో క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, అథ్లెట్లకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.



పతక విజేతలతో భేటీ కావడం అద్భుతమైన సందర్భమని అభివర్ణించిన ప్రధాని, క్రీడాకారుల అంకితభావాన్ని, వారు సాధించిన విజయాలను కొనియాడారు. “మీరు 140 కోట్ల మంది భారతీయుల గౌరవాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటిచెప్పడమే మీరు సాధించిన అతిపెద్ద విజయం. లక్ష్యం పట్ల ఉన్న అభిరుచి విజయంగా రూపాంతరం చెందినప్పుడు, పతకాలతో పాటు ఆ క్రీడాకారుల ముఖాల్లో కనిపించే వర్చస్సు మీ అందరిలోనూ ప్రతిబింబిస్తోంది” అని మోదీ ప్రశంసించారు. ఈ ఘనత కేవలం క్రీడాకారులదే కాదని, దీని వెనుక కోచ్‌లు, సహాయక సిబ్బంది, కుటుంబ సభ్యులతో పాటు కోట్లాది మంది భారతీయుల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే తరుణంలో, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

**చారిత్రక విజయాలపై ప్రశంసలు**

ఈసారి ఆసియా క్రీడలు భారత్‌కు ఎన్నో మైలురాళ్లను మిగిల్చాయని ప్రధాని గుర్తుచేశారు. సుదీర్ఘమైన 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ మహిళల హాకీ జట్టు స్వర్ణం కైవసం చేసుకోవడాన్ని, అలాగే పురుషుల హాకీ జట్టు కూడా పసిడి పతకంతో మెరవడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్, కబడ్డీ విభాగాల్లో భారత్ ‘డబుల్ గోల్డ్స్’ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో అథ్లెట్లు కనబరిచిన అద్భుత ప్రదర్శనలను అభినందించారు. అథ్లెటిక్స్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంతో పాటు, 28 ఏళ్ల తర్వాత వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకం, 1982 తర్వాత మారథాన్‌లో విజయం వంటి చారిత్రక ఘనతలను ఆయన ప్రస్తావించారు. భారత్ సాధించిన మొత్తం 85 పతకాలలో మహిళా అథ్లెట్లు 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలు సాధించడం నవభారత ఆత్మవిశ్వాసానికి, మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రధాని కొనియాడారు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్, సాఫ్ట్ టెన్నిస్, సెయిలింగ్ వంటి క్రీడల్లో తొలిసారిగా పతకాలు సాధించడాన్ని ప్రస్తావిస్తూ, గతంలో ప్రాతినిధ్యమే లేని క్రీడల్లోనూ నేడు భారత్ విజయకేతనం ఎగురవేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

**క్రీడారంగానికి ప్రభుత్వ అండ**

గత దశాబ్ద కాలంగా క్రీడారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను మోదీ వివరించారు. ఒకప్పుడు దేశంలో క్రీడల పట్ల నెలకొన్న నైరాశ్యాన్ని అధిగమించి, నేడు నూతనోత్తేజంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ‘టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్’ (టాప్స్), ‘ఖేలో ఇండియా’ వంటి పథకాల ద్వారా పారదర్శకమైన, అత్యాధునిక క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడా సమాఖ్యలను బలోపేతం చేసేందుకు, క్షేత్రస్థాయి కార్యక్రమాల కోసం సుమారు రూ.36 వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వెయ్యికి పైగా ఖేలో ఇండియా కేంద్రాలు, నూతన స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు ‘టాప్స్’ కింద నెలకు రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, విదేశాల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ లో రాణించడంతో పాటు 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభను వెలికితీయడానికి విస్తృతంగా ‘టాలెంట్ హంట్’ నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులు తమ పాఠశాలలకు, గ్రామాలకు వెళ్లి అక్కడి చిన్నారుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో ఎదురయ్యే ఏ సవాలునైనా ధైర్యంగా ఎదుర్కొనేలా మనిషిని తీర్చిదిద్దుతుందని అభిప్రాయపడ్డారు. “ఆడేవాడే ఎదుగుతాడు” అనే తన సూత్రాన్ని పునరుద్ఘాటిస్తూ, “వికసిత భారత్” లక్ష్య సాధనలో క్రీడారంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## ఢిల్లీలో సీజేపీ నిరసన.. అడ్డుకోలేమన్న హైకోర్టు




ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ పిలుపునిచ్చిన ఈ నిరసనలో తాము కూడా పాల్గొంటామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది. నిరసనకారులు జాతీయ జెండాలతో తరలిరావాలని దీప్కే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ ఎన్నికల సంఘానికి, కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రాంగణంలో మార్చ్ నిర్వహించడంపై దాఖలైన మరో పిటిషన్‌పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా “న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు” అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసన నాటి సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

# యాసంగిలో వరి పంట వేయొద్దు

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితి ఏర్పడిందని, వచ్చే 8, 10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

**కేంద్రం సహాయం చేయాలి**

ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర- రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలని కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్‌ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ చెప్పినవి చేశామని, కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా ఏం చెప్పినా చేశామని అన్నారు. ఇప్పుడు విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలని, దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు.

"సాగు చేయని రైతులకు ఆ నష్టాన్ని కేంద్రం పూడ్చాలి. తాగునీరు, విద్యుత్ సమస్య అధిగమించేందుకు అందరూ సహకరించాలి. నీరు లేక పశువులు, మూగజీవాలకు నష్టపోయే పరిస్థితి రావొద్దు. రాష్ట్రానికి కేంద్రం తోడ్పాటు ఇస్తేనే ఈ విపత్తును అధిగమించగలం. సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. సమస్యలు, సమాచారం ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఇస్తున్నాం. నోడల్ అధికారిగా రామకృష్ణారావును నియమిస్తున్నాం. దసరా తర్వాత భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కరవు పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మీడియాను కోరుతున్నా. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళాకారులు, క్రీడాకారులు ముందుకు రావాలి"

**రిజర్వాయర్లు అన్నీ ఖాళీ అయ్యాయి**

రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు



ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.

**మార్చిలో ఉండే ఎండలు అక్టోబర్‌లోనే**

యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సగటుపై అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందని, మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే ఉన్నాయని తెలిపారు. "కొండపోచమ్మ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వారు. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు వెళ్తోంది. పంచపాండవుల కాలువ నుంచి నేరుగా మోటార్ల ద్వారా కేసీఆర్ నీరు తోడుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరికీ లేని ప్రత్యేక వెసులుబాటు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే ఎందుకు?. ప్రత్యేక మోటార్ల ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు ఎత్తిపోతలపై నిజనిర్ధరణకు మేం సిద్ధం. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అక్రమాలు ఉన్నాయని మొదట్నుంచి ఇంజినీర్ రఘు చెప్పారు. యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ.17,950 కోట్లతో ఒప్పందం చేశారు. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు రూ.37,781 కోట్లకు పెరిగింది. యాదాద్రి థర్మల్ కేంద్రం అంచనాలు ఏకంగా 110 శాతం ఎందుకు పెరిగింది?. ఒక్కో మెగావాట్‌కు రూ.8 వేల కోట్లు అదనపు అంచనాలు పెరిగాయి"

**అఖిలపక్షాలతో రేపు సమావేశం**

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌నినోపై సీఎం సలహాదారు రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులపై రేపు అఖిలపక్షాలతో తెలంగాణ ప్రభుత్వం చర్చించనుంది.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తిలో జరుగుతున్న అంతరాయంపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే దామరచర్లలో యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ (చీఫ్ ఇంజినీర్) సురేశ్ నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యుత్ ఉత్పత్తిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చర్యలు తీసుకున్నారు. మరోవైపు పర్యవేక్షణ కోసం ఐఏఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా ప్రభుత్వం నియమించింది.

మరోవైపు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు థర్మల్ కేంద్రానికి ప్రభుత్వం ఏఐఎస్ అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించింది. హరికిషన్, వెంకటేశ్ దొత్రే, రాహుల్‌రాజ్, హనుమంత్ కొండిబ, శివకుమార్ నాయుడుని స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరు విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరాను పర్యవేక్షించనున్నారు. విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐఏఎస్‌లనూ సస్పెండ్ చేస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

బుధవారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరా సాఫీగా జరిగే విధంగా చూడాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎందుకు మార్పు రావడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో విద్యుత్తు కొరత ఏర్పడే ప్రమాదం



ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోం**

నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినప్పటికీ యాదాద్రి విద్యుత్తు ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది తానేనన్నారు. పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్తు సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పరిస్థితి మారలేదని మండిపడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోనని అధికారులను హెచ్చరించారు. వైఫల్యాలపై విద్యుత్తు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్‌కో సీఎండీ సంబంధిత విభాగానికి సంబంధించిన అధికారులను సస్పెండ్ చేస్తానన్నారు. విద్యుత్తు అంతరాయాలకు రోజుకో కారణం చెప్పొద్దన్నారు.

# సింగరేణిలో వేడెక్కుతున్న రాజకీయం..!

**హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలకు నగారా మోగనుంది. అయితే ఈ లోపే సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ పార్టీలను అప్రమత్తం చేశాయి. వేలాది మంది కార్మికుల కుటుంబాలు సింగరేణి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇలాంటి ఎన్నికల్లో గెలవడం ద్వారా సత్తా చాటాలని రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి.సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కోల్‌బెల్ట్ ప్రాంతం దాదాపు 13 అసెంబ్లీ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. ఇక్కడి కార్మికులు, వారి కుటుంబాల ప్రభావం ఎన్నికల ఫలితాలపై గట్టిగా ఉంటుంది. అందుకే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గతం నుంచి కూడా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన పార్టీనే ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధిస్తుందనే బలమైన నమ్మకం రాజకీయ వర్గాల్లో ఉంది.గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే యూనియన్ ఎన్నికలు జరుగాయి. అయితే ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారాయి. నవంబర్ లేదా డిసెంబర్ నాటికి ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే న్యాయస్థానంలో వివిధ సంఘాలు వేసిన పిటిషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ వైఖరి, కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఎన్నికల షడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశాయి.ఎన్నికలు రాబోతున్నాయన్న సంకేతాలు రావడంతో అధికార, ప్రతిపక్ష



పార్టీలు కార్మికులను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. కార్మికుల ఓట్లను రాబట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలపై దృష్టి సారించింది. కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, గృహ నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఇళ్ల పట్టాల సమస్యల పరిష్కారం వంటి హామీలతో కార్మికులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. దసరా పండగవేళ ప్రకటించిన భారీ బోనస్ కూడా తమకు కలిసొస్తుందని నమ్ముతోంది.ఇక.. ప్రతిపక్ష బీఆర్ఎస్ దూకుడు మీదుంది. గల్ఫ్, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తమకు మంచి పట్టు ఉందని ఆ పార్టీ నమ్ముతోంది. దాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అనుబంధ సంఘం అయిన టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక గర్జనలు, బహిరంగ సభలను నిర్వహిస్తోంది. ఇవాళ చలో సింగరేణికి పిలుపునిచ్చిన ఆ పార్టీ? సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వంపై ఎక్కుపెడుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పాటు బీజేపీ అనుబంధ సంఘాలు అలాగే లెఫ్ట్ పార్టీల అనుబంధ యూనియన్లు కూడా క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. కార్మికుల సమస్యలపై గళం విప్పుతున్నాయి. మంచిర్యాల, చెన్నూరు, రామగుండం వంటి కోల్‌బెల్ట్ ప్రాంతాలు ప్రధాన రాజకీయ పార్టీల కార్యకలాపాలతో హోరెత్తుతున్నాయి.గతంలో సింగరేణి ప్రాంతంలో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన శక్తులు నేడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కేవలం వేతన ఒప్పందాలు, బోనస్‌లు మాత్రమే కాకుండా కార్మికుల సర్వతోముఖాభివృద్ధి, ఉద్యోగ భద్రత, జీవన ప్రమానాల మెరుగుదల ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో రానున్న సింగరేణి ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక దిక్సూచిగా నిలవనున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కరెంట్ కోతలు.. అధికారులపై నెపమా రేవంత్?



**హైదరాబాద్:** తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు అధికారులను బాధ్యులను చేస్తూ సీఎం, మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించారు. బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఏర్పాటు చేసుకోకపోవడం, విద్యుత్ రంగంపై సకాలంలో సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే కరెంట్ కోతల పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు తొమ్మిది నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు పరిస్థితి తీవ్రం కావడంతో అధికారులను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరించడం సరికాదన్నారు. నిషేధిత భూముల జాబితా అంశంలోనూ ప్రభుత్వమే తప్పులు చేసి అధికారులపై నెపం నెట్టిందని హరీశ్ రావు విమర్శించారు. విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే వైఖరిని అనుసరిస్తోందని ఆరోపించారు. ఎల్‌నినోను కోవిడ్ తరహా విపత్తుగా సీఎం అభివర్ణించడాన్ని ప్రస్తావిస్తూ.. అలాంటి పరిస్థితి వస్తుందని ముందే హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రభుత్వం ఎందుకు అప్రమత్తం కాలేదని ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్, బీజేపీ భారీ స్కెచ్!

-మొదటిపేజీ తరువాయి

ముందస్తుగా అప్రమత్తం చేసింది. మొత్తం 77 మందిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు సాధించేందుకు ప్రణాళిక రచించింది. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, నల్గొండ- వరంగల్- ఖమ్మం స్థానానికి 34 మంది ఇన్‌చార్జ్‌లను కేటాయించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో ఆయా ఎమ్మెల్యేలకే ఆ బాధ్యతలు అప్పగించడం ద్వారా క్షేత్రస్థాయిలో నాయకత్వ సమన్వయ లోపం రాకుండా జాగ్రత్త పడ్డారు. ఎమ్మెల్యేలు లేని చోట ఎంపీలు, ఎమ్మెల్సీలకు పగ్గాలు అప్పగించారు. కొడంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతను అనుముల తిరుపతిరెడ్డికి అప్పగించడం ద్వారా నాయకుల మధ్య జవాబుదారీతనం పెంచే ప్రయత్నం చేశారు.ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండు ఎమ్మెల్సీ ఎన్నికలపై అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయిలో నేతల పనితీరుపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, మొదటి స్థానానికే పూర్తి ప్రాధాన్యం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రులు సైతం ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఆదేశించడం ద్వారా ఈ ఎన్నికలను కాంగ్రెస్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపు ఓటములు ప్రధానంగా ఓటర్ల నమోదు ప్రక్రియపైనే ఆధారపడి ఉంటాయి. పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటర్లుగా పేరు నమోదు చేసుకునేలా చేయడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ పోలింగ్ బూత్ వరకు రప్పించడం ప్రస్తుతం కాంగ్రెస్ ముందున్న ప్రధాన సవాల్. ఈ నేపథ్యంలోనే ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని నేతలను ఆదేశించారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంతో, ప్రచార సమన్వయంపై ఇన్‌చార్జ్‌లు దృష్టిసారించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలు రాబోయే రాజకీయ పరిణామాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయానికి అద్దం పడతాయని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. మేధావి వర్గంగా భావించే గ్రాడ్యుయేట్లు ఇచ్చే తీర్పు ప్రభుత్వానికి మరింత నైతిక బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి.. అధికారంలో ఉన్న జోరును గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ ప్రదర్శించి క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. ఇన్‌చార్జ్‌ల నియామకం, సీఎం రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచుతున్నాయి.

**రామచందర్ రావు వైపే మొగ్గు!**

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి నడుస్తోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రెండు కమిటీలను రంగంలోకి దించింది. ఈ కమిటీలు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాయి. ఇందులో ఒక స్థానానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైపే మెజారిటీ నేతలు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ కేడర్ మూడ్‌ను అంచనా వేయడానికి బీజేపీ హైకమాండ్ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం విడివిడిగా రెండు కమిటీలను ఏర్పాటు చేసి మరీ కిందిస్థాయి అభిప్రాయాలను సేకరిస్తోంది. ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కోసం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఈ మూడు ఉమ్మడి జిల్లాల కీలక నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాల ఎంపికపై నేతలు తమ మనసులోని మాటను కమిటీ ముందుంచారు.ఈ అభిప్రాయ సేకరణలో మెజారిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత ఎన్.రామచందర్ రావు వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే స్థానం నుండి ప్రాతినిధ్యం వహించిన అనుభవం, పట్టభద్రులలో ఉన్న మంచి పేరు, లాయర్‌గా ఆయనకున్న ప్రజా మద్దతును నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. చాలా మంది నేతలు ఆయన పేరును మాత్రమే ప్రధానంగా సూచించినట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుడికి మళ్లీ అవకాశం ఇస్తే గెలుపు మరింత సులభమవుతుందని కేడర్ గట్టిగా భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.మరోవైపు.. అభిప్రాయ సేకరణలో అందరూ ఏకాభిప్రాయంతో లేరని సమాచారం. కొంతమంది నాయకులు మాత్రం "పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయించినా మాకు అభ్యంతరం లేదు, పార్టీ నిర్ణయమే శిరోధార్యం" అని స్పష్టం చేశారు. మరికొంత మంది మాత్రం ఒకవేళ రామచందర్ రావు కాకపోతే పలానా వ్యక్తికి అవకాశం ఇవ్వాలని ప్రత్యామ్నాయ అభ్యర్థుల పేర్లను సూచించారు. అయితే ఇలా సూచించిన వాళ్ళ సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.ఏది ఏమైనప్పటికీ, మెజారిటీ నాయకుల మద్దతు రామచందర్ రావు వైపు ఉండటంతో బీజేపీ వర్గాల్లో ఆయన పేరే ప్రధానంగా వినిపిస్తోంది. అభిప్రాయ సేకరణ కమిటీలు సేకరించిన ఈ నివేదికను త్వరలోనే రాష్ట్ర నాయకత్వం ద్వారా కేంద్ర పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న తరుణంలో, అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

## సంపాదకీయం

# సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం

తమిళనాడు రాజకీయ వేదికపై దశాబ్దాలుగా నడుస్తున్న సిద్ధాంత పోరాటంలో నిశ్శబ్ద విప్లవం కనిపిస్తోంది. ఒకప్పుడు ద్రవిడ ఆత్మగౌరవం, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి , హిందీ వ్యతిరేక నినాదాలతో జాతీయ పార్టీలను, ముఖ్యంగా కాషాయ రాజకీయాలను నిరంతరం శత్రువుగా చిత్రీకరించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఆయన తమిళనాడులో అడుగుపెట్టిన ప్రతిసారీ విపక్షాలు, తమిళ జాతీయవాద సంఘాలు గో బ్యాక్ మోదీ నినాదాలతో విరుచుకుపడేవి. నల్లజెండాలు, ఆకాశంలోకి ఎగిరే నల్ల బెలూన్లు ప్రధాని పర్యటనలకు నిరసన కాన్వాయ్‌లుగా మారిన రోజులను తమిళనాడు చూసింది. కానీ, ల చెన్నై మెట్రో ఫేజ్–2 ప్రారంభోత్సవంతో పాటు రూ. 13,000 కోట్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ పర్యటించిన తీరును పరిశీలిస్తే, రాష్ట్రీయ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సారి ప్రధాని పర్యటన వేళ గాలిలో నల్ల బెలూన్లు కానీ, రోడ్లపై భయానక నిరసనలు కానీ ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో రవాణా, విద్య, పరిశోధన, మౌలిక వసతుల రంగాలు వేగంగా పుంజుకునేలా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి ప్రధాని ఇక్కడికి వచ్చారు. ఇందులో ప్రధానంగా చెన్నై మెట్రో ఫేజ్–2 మార్గం ప్రారంభోత్సవంతో పాటు ఐఐటీ మద్రాస్ బ్రెయిన్ సెంటర్ సందర్శన లాంటి కీలక అధికారిక కార్యక్రమాలు ఉన్నాయి.ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీతో కలిసి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అటు పరిపాలన పరంగా, ఇటు రాజకీయ వర్గాల్లో ఈ భేటీ సరికొత్త చర్చకు దారితీసింది. రాజకీయ వైరుధ్యాలు పక్కనబెట్టి, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రధానితో ఒకే వేదికను పంచుకోవడమే కాకుండా, మెట్రో రైలులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించడం తమిళనాడు క్షేత్రస్థాయి రాజకీయాల్లో వచ్చిన గుణాత్మక మార్పునకు అద్దం పడుతోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేంద్ర పెద్దల పర్యటనను నిరసనలతో హోరెత్తించే సంస్కృతి స్థానంలో ఇప్పుడు సంయమనం, పరస్పర గౌరవం చోటుచేసుకున్నాయి.తమిళ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషిస్తే.. తమిళ ప్రజల ఆలోచనా విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. ఉచితాలు , సెంటిమెంట్ రాజకీయాల కంటే అభివృద్ధి , మౌలిక వసతుల కే తమిళ యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. చెన్నై మెట్రో విస్తరణ, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, పారిశ్రామిక హబ్‌లకు కేంద్ర నిధులు అత్యంత ఆవశ్యకమని భావిస్తున్న నేపథ్యంలో, అనవసరమైన రాజకీయ ద్వేషం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందనే అభిప్రాయం తమిళ నెటిజన్లలో వ్యక్తమవుతోంది. తమిళనాడు రాజకీయ రంగాన కొత్తగా ఆవిర్భవించిన పొలిటికల్ శక్తులు , మారిన ద్రవిడ కూటముల వ్యూహాలు కూడా ఈ మార్పునకు కారణమయ్యాయి. బీజేపీపై కేవలం రొటీన్ ఆరోపణలతో ఇకపై ఓటు బ్యాంకును నిలబెట్టుకోలేమని గ్రహించిన ప్రధాన ద్రవిడ పార్టీలు, వ్యూహాత్మకంగా తమ ఘర్షణ వైఖరిని తగ్గించుకున్నాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రసంగాల్లో తిరుక్కురళ్ పద్యాలను, తమిళ సంస్కృతి, భారతీయార్ కవితలను నిరంతరం ప్రస్తావిస్తూ తమిళ భాషాభిమానాన్ని ఆకట్టుకునేందుకు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు కాషాయంపై ఉన్న సైకలాజికల్ భయాన్ని గణనీయంగా తగ్గించాయి. ఈ మార్పు వెనుక ఉన్న మరో ముఖ్యమైన రాజకీయ కోణం.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలకు మారుతున్న అవసరాలు. ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీ గా చూసిన ద్రవిడ నేతలు ఇప్పుడు కేంద్రంతో సత్సంబంధాలు నెరపడం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి నిధులు తెచ్చుకోగలమని భావిస్తున్నారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో బీజేపీ వేగంగా పుంజుకోవడం, ఓటు బ్యాంకును విస్తరించుకోవడంతో నేరుగా కాషాయ శ్రేణులతో విభేదించడం కంటే రాజకీయ పోటీని ప్రజాసమస్యలపైకి మళ్లించడమే ఉత్తమమని స్థానిక నాయకత్వాలు నిర్ణయించుకున్నాయి. ఒకప్పుడు తమిళనాడు రాజకీయాల్లో విజయానికి మార్గంగా ఉన్న కాషాయ వ్యతిరేకత , బీజేపీ ద్వేషం ఇప్పుడు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోంది. నల్ల బెలూన్ల స్థానంలో అభివృద్ధి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిచ్చే నయా రాజకీయ శకం తమిళ నేలలో ప్రారంభమైంది. రాబోయే ఎన్నికల్లో కేవలం భావోద్వేగాలు, ద్రవిడ సెంటిమెంట్లు మాత్రమే కాకుండా, సంక్షేమం , మౌలిక వసతుల రూపకల్పనే గెలుపోటములను నిర్ణయించే ప్రధాన అంశంగా మారబోతోంది.

# ఆగ్రహించిన ఫ్రాన్స్ విద్యార్థి!



మరో ఆర్నెల్లలో ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆ దేశం హైస్కూల్ విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. రాజధాని పారిస్‌లో గత నెల 18న రాజుకున్న ఆందోళన విస్తరించటానికి ఎంతోకాలం పట్టలేదు. వేలాదిమంది విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ అరెస్టు చేయగా... బాష్పవాయు గోళాలు, స్టన్ గ్రెనేడ్‌లు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించటంతో వందలాదిమంది పిల్లలు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఉద్యమం వల్ల వేలాది పాఠశాలలు మూతబడ్డాయి. కొన్నిచోట్ల పాఠశాల భవనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పెట్టగా, తమపై సాగిస్తున్న హింసను సమర్థించుకోవటానికి పోలీసులే ఆ పని చేస్తున్నారని ఉద్యమకారుల ఆరోపణ. ఎన్నికలు ముంగిట్లో పెట్టుకుని ఏ ప్రభుత్వమూ జనంతో తగాదా పడదు. కానీ అధ్యక్షుడు ఇమానియేల్ మాక్రాన్ ఇందుకు విరుద్ధం. వరసగా 2017, 2022 అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ఆయన ఎటూ రాజ్యాంగ ప్రకారం మూడో దఫా పోటీ చేయడానికి లేదు. కనుకనే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నట్టు కనబడుతోంది.
మన దేశంలో ఆమధ్య కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు యూపీ, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్ర తదితరచోట్ల బడుల్ని సందర్శించి పశువుల పాకల్లో తరగతులు నడవడం, టీచర్లు లేకపోవటం, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో పిల్లలు బిక్కుబిక్కుమంటూ చదువుకోవడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఆ తర్వాత సీజేపీ నేతలపై దాడులు, అరెస్టులు మొదలయ్యాయి. ఎంతో అభివృద్ధి సాధించిందని అందరూ అనుకునే ఫ్రాన్స్‌లో సైతం బడులు ఇలాగే అఘోరించాయని వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. చాలా పాఠశాలలకు టీచర్ల కొరత. దీనికితోడు కూలిన గోడలు, విరిగిన కిటికీలు, లీకవుతున్న పైకప్పులు, సరిగా పనిచేయని హీటింగ్ వ్యవస్థలు వెక్కిరిస్తున్నాయి. తరగతి గదులు కిక్కిరిసిపోతున్నాయని, అందువల్ల టీచర్లు శ్రద్ధ పెట్టలేకపోతున్నారని పిల్లల ఆరోపణ. ఫ్రాన్స్‌లో ప్రత్యేక శ్రద్ధ అవసరమైన ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి 12నుంచి 24మంది లోపు పిల్లలుండాలని, సాధారణ పాఠశాలల్లో ఈ సంఖ్య 22--26 మధ్య ఉండొచ్చని నిర్దేశించారు. చిత్రమేమంటే ఈసారి అధికారంలోకి రావాలని ఆరాటపడే లీపెన్ నేతృత్వంలోని అతి మితవాద పక్షం విద్యార్థుల్ని తప్పుబడుతోంది. పాలకులు నియంతలైనప్పుడు తిరగబడాలని ప్రపంచానికి బోధించింది ఫ్రాన్సే. రాజరికాన్నీ, భూస్వామ్య వ్యవస్థనూ సమాధి చేసిన బాస్టిల్ కోట ముట్టడి 1789 జూలై 14న పారిస్‌లో జరిగిన భారీ ర్యాలీ పర్యవసానమే. అంతవరకూ ప్రపంచ చరిత్రలో జనం ఇలా సామూహిక ప్రదర్శన నిర్వహించిన దాఖలా లేదు. 1968లో పతనమవుతున్న విద్యాప్రమాణాలనూ, ఉన్నత విద్యాసంస్థల్లో సదుపాయాల లేమినీ ప్రశ్నిస్తూ విద్యార్థులు భారీ ఉద్యమాన్ని నిర్వహించారు. డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదనను నిరసిస్తూ 2018--2020 మధ్య జరిగిన 'యెల్లో వెస్ట్' ఉద్యమం సాగింది. ఈ ఉద్యమాల నుంచి ప్రస్తుత పాలకులు నేర్చుకున్నదేమీ లేదు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాక ఫ్రాన్స్ రెండో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయినా విద్యారంగం గుడ్లు తేలేస్తున్నది. అంతేకాదు... వైద్యం, పెన్షన్లు, ఇతర సామాజిక సేవా రంగాలూ నానాటికీ క్షీణిస్తున్నాయి. మరోపక్క రక్షణ రంగానికి కేటాయింపులు భారీగా పెరిగాయి. మాక్రాన్ తొలి ఏలుబడి నాటికి 3,500 కోట్ల డాలర్లుండే రక్షణ బడ్జెట్ ఇప్పుడు 7,100 కోట్ల డాలర్లు! రష్యాను 'ఎప్పటికైనా' జయించాలన్న తాపత్రయంతో నాటో భాగస్వామ్య దేశాలన్నిటికీ ఈ ఉన్మాదం పట్టుకుంది. ఫ్రాన్స్ అప్పు 3 లక్షల 60 వేల కోట్ల డాలర్ల పైమాటే. దాని జీడీపీలో ఇది 119 శాతం. బడ్జెట్ లోటు జీడీపీలో 5.4 శాతం. ఈయూ విధించిన పరిమితి కేవలం 3 శాతం. ప్రభుత్వం ఖర్చుల కోసం బాండ్లు వేలం వేస్తే కొనే నాథుడే లేడంటే పరిస్థితి ఎంత దిగజారిందో తెలుస్తుంది. ఫ్రాన్స్ వాలకంతో ఈయూ సభ్య దేశాలు లబోదిబోమంటున్నాయి. ఆ సంక్షోభం వల్ల యూరో విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని మొత్తుకుంటున్నాయి. అందుకే ఈ పార్లమెంటు సమావేశాల్లో 'కఠినమైన బడ్జెట్ కోతలు' విధించటానికి ప్రభుత్వం సిద్ధపడుతుండగా, ఈలోగా విద్యార్థి ఉద్యమం వచ్చిపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనకపోతే ఈ సంక్షోభం మరింత విస్తరిస్తుంది.

# సౌదీపై హౌతీ దాడులు



పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ యుద్ధ జ్వాలలు చల్లారకముందే సౌదీ అరేబియాహౌతీల మధ్య ఘర్షణ మళ్లీ తీవ్రరూపం దాల్చడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. యెమెన్‌లో దశాబ్దకాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఇరాన్‌సౌదీ పోటాపోటీ వైఖరి ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. కాల్పుల విరమణలు, దౌత్య చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో కొంతకాలం కనిపించిన ప్రశాంతత శాశ్వత శాంతికి దారితీయకపోవడం ఈ ప్రాంతంలోని అస్థిరతకు అద్దం పడుతున్నది. ఒకవైపు ఇజ్రాయెల్‌పాలస్తీనా సంక్షోభం, మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై దాడుల ముప్పు, ఇంకోవైపు గల్ఫ్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం పోటీ.. ఈ పరిణామాల మధ్య సౌదీహౌతీ ఉద్రిక్తతలు పెరగడం ఏమాత్రం వాంఛనీయం కాదు. ప్రపంచ వాణిజ్యం, చమురు సరఫరా, ఆహార భద్రత, అంతర్జాతీయ దౌత్యసం బంధాల మీదా ఈ ఘర్షణ తీవ్ర ప్రభావం చూపే ప్రమాదము న్నది. 2022లో యెమెన్ ప్రభుత్వం, తిరుగుబాటుదారుల మధ్య కుదిరిన సంధితో సౌదీ అరేబియా, హౌతీల మధ్య ప్రత్యక్ష ఘర్షణలు కొంతకాలం తగ్గుముఖం పట్టినప్పటికీ, యెమెన్ అంతర్యుద్ధానికి శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. ఈ ఏడాది జూలైలోనే క్షిపణి దాడులు మళ్లీ మొదలయ్యాయి. అక్టోబర్‌లో పరిస్థితి మరింత విషమించింది. సౌదీ రాజధాని రియాద్ విమానాశ్రయంపై దాడులు, చమురు, మౌలిక సదుపాయాలపై క్షిపణుల ప్రయోగం, సౌదీ ప్రతిదాడులతో ఉద్రిక్తతలు ప్రమాదకర స్థాయికి చేరాయి. ఈ నెల 13న ధహ్రాన్‌లోని సౌదీ అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హౌతీలు దాడి చేశారు. సౌదీ విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై మరిన్ని దాడులు చేస్తామని హౌతీలు హెచ్చరించడం గమనార్హం. ఈ ఘర్షణల వెనుక ప్రాంతీయ శక్తుల ప్రయోజనాలు, ఇరాన్‌సౌదీ విభేదాలు, అమెరికా పాత్ర, ఎర్ర సముద్రంపై నియంత్రణ వంటి అనేక అంశాలు ఉన్నా యి. హౌతీలకు ఇరాన్ మద్దతు ఉండగా, అంతర్జాతీ యంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా అండగా నిలబడుతున్నది. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా చమురు క్షేత్రాలు, శుద్ధి కేంద్రాలు, ఎగుమతి టెర్మినళ్లు, విమానాశ్రయాలపై దాడులు కొనసాగితే ఉత్పత్తి, రవాణా, సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగి, ఆర్థిక రంగంపై ఒత్తిడి తేవడం కనిపిస్తున్నది. ఇక్కడ మరో కీలక భౌగోళిక అంశం బాబ్ ఎల్ మండెబ్ జలసంధిలో హౌతీలు జరుపుతున్న దాడులు. సౌదీ అరేబియా సహా గల్ఫ్ దేశాల నుంచి చమురు, ఇతర సరుకుల రవాణాలో జలసంధికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్నది. ఈ మార్గంలో నౌకలపై దాడులు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాల్సి వస్తున్నది. దీనివల్ల పెరిగే అదనపు భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుంది. భారీ ఇంధన దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశానికి ఇది చిన్న సమస్య కాదు. ఈ ఘర్షణల నిలిపివేతకు, యెమెన్‌లో శాశ్వత శాంతికి ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఐక్యరాజ్యసమితితో పాటు, ఒమన్ వంటి దేశాలు మధ్యవర్తిత్వానికి చురుకైన పాత్ర పోషించాలి. ప్రపంచం మరో విస్తృత యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు.

# మరో కేంద్ర మంత్రి రాజీనామా ? కొత్త టీం ఎప్పుడు?

**న్యూఢిల్లీ :** కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ హఠాత్తుగా తన పదవితో పాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కలకలం రేపింది. తమిళనాడులో బిజెపి మూలాలను పటిష్టం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. సాధారణ రోజు కూలీల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రధాని మోదీ మంత్రివర్గంలో భాగస్వామ్యం కల్పించడం గొప్ప గౌరవమని, ఇకపై పార్టీ ఆర్గనైజేషన్‌కు తన సమయాన్ని కేటాయిస్తానని ఎక్స్ వదికగా వేసిన పోస్ట్‌లో మురుగన్ స్పష్టం చేశారు.మురుగన్ వైదొలగడం కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో మోదీ 3.0 సర్కార్‌లో జరగబోయే భారీ మంత్రివర్గ విస్తరణ కు ఇది ప్రధాన సంకేతమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కేంద్ర మంత్రివర్గంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, జార్జ్ కురియన్ తమ పదవులకు రాజీనామా చేయగా, హర్దీప్ సింగ్ పురీ, బి.ఎల్. వర్మ వంటి సీనియర్లను పార్టీ రాజ్యసభకు పునరుద్ధరించలేదు. మరోవైపు సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వ్యక్తికి ఒకే పదవి నిబంధన ప్రకారం ఆయన కూడా మంత్రిపదవి నుంచి తప్పుకోనున్నారు.ఇలా దాదాపు అరడజనుకు పైగా కేంద్ర మంత్రి పదవులు ఖాళీ కావడంతో, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో భారీ రీ–షఫుల్‌కు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కేంద్ర క్యాబినెట్‌లో ప్రాంతీయ, సామాజిక సమతుల్యతను దెబ్బతినకుండా చూసేందుకు బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపేలా స్థానిక నాయకులను సంస్థాగత బాధ్యతల్లోకి మళ్లిస్తూ, లోక్‌సభ సభ్యులుగా ఉన్న కొందరు సీనియర్లకు కేంద్రంలో అవకాశం కల్పించవచ్చని ప్రచారం సాగుతోంది.మురుగన్ లాంటి సీనియర్ నేతలను తిరిగి క్షేత్రస్థాయికి పంపి, కేంద్రంలో ఖాళీ అయిన స్థానాలను కొత్త ముఖాలతో భర్తీ చేసేందుకు వీలుగా ఢిల్లీ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పార్టీ యంత్రాంగాన్ని రాబోయే ఎన్నికల కోసం సన్నద్ధం చేయడమే లక్ష్యంగా మోదీ–అమిత్ షాల ద్వయం ఈ మంత్రివర్గ విస్తరణ వేదికగా కొత్త వ్యూహాలను అమలు చేయబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# యాసంగిలో వరి సాగు వద్దు

**ఆరుతడి పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి.**
**పీపీసీలకు వచ్చే ధాన్యం, ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లే ధాన్యం పరిమాణాన్ని అంచనా వేయాలి.**
**వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష.**
**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, అక్టోబర్ 15:**

ప్రపంచవ్యాప్తంగా మారిన కాలమాన పరిస్థితులకు తెలంగాణ ప్రభుత్వం రైతులు నష్టపోవద్దు అనే సంకల్పంతో యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై చేయించాలని దృష్టి సారించింది. ఇదే విషయంపై గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించి ఆదేశించారు.

**తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొలాలను బీడుగా



ఉంచుకోవాలని తెలిపారు. వరి సాగుకు బదులుగా మొక్కజొన్న, పప్పుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను నివారించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులకు అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు అంచనాలు సిద్ధం చేయాలని




సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (పీపీసీ) ఎంత పరిమాణంలో ధాన్యం వచ్చే అవకాశం ఉంది, ప్రైవేటు మార్కెట్‌కు ఎంత పరిమాణంలో వెళ్లే అవకాశం ఉందనే అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఈ వివరాల ఆధారంగా ధాన్యం సేకరణకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సరైన పంటల ఎంపికపై సూచనలు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే!



**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: తెలంగాణ రక్షణ సేన**

**అగ్ని ధార న్యూస్ ,(కరీంనగర్):**

జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన విలేకరులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్ ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం దురదృష్టకరమన్నారు. ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలన్నారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం భద్రత కల్పించాలని కోరారు. టీఆర్ఎస్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీతరెడ్డి, నగర అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, నాయకులు శ్రీరాముల రమేష్, మ్యాకల తిరుపతి, బసవేణి రాజేందర్, మడిపల్లి వినీత్, చిట్టంపల్లి నాగరాజు, పల్లె శారద, కొత్తూరి రఘు తదితరులు పాల్గొన్నారు.

## జగదేవపూర్ మండల కేంద్రంలో ఈ-వెహికల్ షోరూమ్ ప్రారంభం




**నిర్వాహకులు స్వామి నర్సిములు**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ షోరూమ్‌ను నిర్వాహకులు స్వామి, నర్సింహులు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా ప్రారంభించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ మచ్చ గణేష్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు, మాజీ ఎంపీటీసీ కొత్త కవితా శ్రీనివాస్ రెడ్డి హాజరై, రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ వాహనాల వల్ల పర్యావరణ కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. రాబోయే రోజుల్లో ఇంధన లభ్యత తగ్గడంతో పాటు, పెట్రోల్, డీజిల్ ధరల భారం ప్రజలపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. కానీ, ఎలక్ట్రిక్ వాహనాలు ఉపయోగించడం వల్ల ఒకవైపు పర్యావరణాన్ని కాపాడుకోవడమే కాకుండా, మరోవైపు ప్రయాణ ఖర్చులను భారీగా తగ్గించుకోవచ్చు. కాబట్టి ప్రజలందరూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపాలి.?ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్లు బచ్చలి భాస్కర్ బత్తిని శ్రీనివాస్ గుబ్బ శ్రీనివాస్ పెద్ది శ్రీనివాస్ వలాల వెంకటేష్ కృష్ణమూర్తి దయాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయంఎకృషితో ఎదగడం అభినందనీయం



**ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు స్వయంకృషితోనే ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ సెంటర్, అదేవిధంగా మక్తమాదారం గేటు వద్ద జనరల్ స్టోర్ ను గంప వెంకటేష్ గుప్తా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. నిరుద్యోగులు స్వయంకృషితో, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని అన్నారు. చిన్న వ్యాపారాలే రేపు పెద్ద సంస్థలుగా ఎదుగుతాయని, యువత ఆ దిశగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సర్పంచులు సేవ్య నాయక్, నరసింహ గౌడ్, ఉప సర్పంచ్ లు శ్రీనివాస్ గౌడ్, పాండు నాయక్, ఆమనగల్లు కౌన్సిలర్ ఎనుమల రమేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్, మాజీ ఎంపిటిసి చంద్రమౌళి, నాయకులు జహంగీర్ అలీ, మాజీ వార్డు సభ్యులు హెచ్ ఆర్ మహేష్, యూత్ వింగ్ అధ్యక్షుడు అంజి, రాములు యాదవ్, భీమ్లా నాయక్, శ్రీకాంత్ యాదవ్, జగదీష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, గొర్ల వంశీ, కిరణ్ గౌడ్, శేఖర్ గౌడ్, సుదర్శన్ యాదవ్, తిరుపతిరెడ్డి, సాయిబాబా చారి, రాయకంటి, సురేష్, గూడూరు జంగారెడ్డి, గూడూరు శేఖర్ రెడ్డి, రాములు గౌడ్, యాదయ్య గౌడ్, బాల్ రాజ్ , చెన్నకేశవ, అందే కార్ రమేష్, బాలకృష్ణ, వెంకటేష్ స్థానిక నాయకులు, వ్యాపారస్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"**

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకం,అలంకరణ సేవ,తదుపరి నైవేద్యం సమర్పణ,మహా హారతి ఇచ్చారు, ఐదవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి గా దర్శనమిచ్చిన దుర్గాదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు, అనంతరం హోమ కార్యక్రమాలు నిర్వహించి నవగ్రహాలకు సర్వదేవతలకు అర్చకుల స్వాహా కారాలతో అవిషలు సమర్పించారుఆలయ సన్నిధిలో సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన అర్చకుల మంత్రోచ్ఛరణలతో ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః, శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి నమః, దుర్గాదేవియై నమః సర్వ మంగల మాంగళ్యే శివే సర్వార్ధ సాధకే శరణే త్రయంబకే గౌరీ నారాయణి నమోస్తుతే నమః పార్వతీ పత హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులతో కుంకుమార్చన చేయించారు లలిత సహస్రనామం పారాయణ చేశారు అనంతరం మహిళలు, పిల్లలు భక్తి పాటలు ఆలపించారు ఈ కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జున స్వామి, సంగమేశ్వర్ స్వామి, కార్తీక్ స్వామి, గ్రామ పెద్దలు,భక్తులు, మహిళలు, పిల్లలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## నూతన ఎస్సై కి సన్మానం



**అగ్నిధార న్యూస్ (వికారాబాద్ )**

వికారాబాద్ జిల్లా బంటారం మండల్, బస్వాపురం గ్రామస్తులు స్థానిక బంటారం పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన సబ్ ఇన్స్పెక్టర్ పుల్దీప్ కి శాలువా పుష్ప మాల తో సత్కరించారు. మండలం లోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతలను కొనసాగిస్తానని హామీ ఇచ్చారు . ఆపదలో తన తగ్గరకు వచ్చిన బాధితులకు అన్ని రకాలుగా ఆదు కుంటానని తెలియజేసారు. గ్రామాల్లో ఉన్న యువత బాగా ఉన్నత చదువు కొని తన లాగా మంచి ఉద్యోగాలు చెయ్యాలని చూసించారు. ఎట్టి పరిస్థితి ల్లో అసాంఘీ క కార్యక్రమం ల్లో పాలు పంచుకోవద్దు అన్నారు. ఈ కార్యక్రమం లొ శ్రీకాంత్ ముదిరాజ్, లక్ష్మ రెడ్డి, కంటప్ప, వెంకటేశం, రవి, నారాయణ, పూరీషోత్తం, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో మాడల్

### ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

**ముంబై, అక్టోబర్ 15 :** ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో జెడ్ఎన్జీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.12.27 లక్షల మధ్యలో ధరను నిర్ణయించింది. సీఎన్జీ, పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది. కేవలం 4.9 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు అడ్వాన్స్‌డ్ సీఎన్జీ టెక్నాలజీ కలిగిన ఈ మాడల్ కిలోకు 24.7 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. భద్రతా ప్రమాణాలు పాటించడంలో భాగంగా ఫైవ్ స్టార్ రేటింగ్, 35 స్టాండర్డ్ ఫీచర్లు ఉన్నాయి. వీటిలో 26 సెంటీమీటర్ల హెచ్‌డీ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో కార్‌ప్లే, రియర్ వ్యూ కెమెరా, క్రూజ్ కంట్రోల్, టైప్ సీ చార్జర్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు,

## దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ




**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి–నారాయణ

పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ పల్లె మాధవి–నారాయణ తన గౌరవ వేతనం నుంచి దుస్తులను పంపిణీ చేశారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో, గ్రామ ప్రజలకు నిరంతరం సేవలు అందించడంలో పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. సిబ్బంది సేవలను గుర్తించి, దసరా పండుగ సందర్భంగా తన వంతుగా ఈ చిన్న సహాయాన్ని అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది పట్ల గౌరవం, అభిమానం చాటుకుంటూ తన గౌరవ వేతనం నుంచి దుస్తులు పంపిణీ చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం గ్రామ పంచాయతీ సిబ్బందిలో పండుగ సంతోషాన్ని నింపింది.

## జాడ లేని బతుకమ్మ చీరల పంపిణీ




**నిరాశలో మహిళా లోకం**

**అగ్ని ధార న్యూస్:పినపాక**

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే రాష్ట్ర పండుగ 'బతుకమ్మ' అనగానే ప్రతీ పేద ఇంటా పండుగ వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రతి ఏటా ఆడబిడ్డలకు కానుకగా అందించిన 'బతుకమ్మ చీరలు' పేద కుటుంబాల్లో ఎంతో సంతోషాన్ని నింపేవి. కానీ, ఈ ఏడాది సద్దుల బతుకమ్మ దగ్గర పడుతున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి బతుకమ్మ చీరల పంపిణీపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం, జిల్లాల్లో పంపిణీ ఊసెత్తకపోవడంతో రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

గతంలో పండుగకు కనీసం రెండు మూడు వారాల ముందే గ్రామాల్లోని రేషన్ దుకాణాల ద్వారా ఈ చీరల పంపిణీ ప్రక్రియ ప్రారంభమయ్యేది. కానీ ఈసారి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. మరోవైపు, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఆడపడుచులకు ప్రభుత్వ కానుకగా అందే ఈ చీరల పంపిణీపై ప్రభుత్వం వెంటనే స్పష్టతనివ్వాలని మహిళలు, చేనేత సంఘాలు కోరుతున్నాయి. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి, తక్షణమే బతుకమ్మ చీరల పంపిణీపై నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మెరిసిన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

### సెన్సెక్స్ 1,534, నిఫ్టీ 375 పాయింట్లు వృద్ధి

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. బ్యాంకులు, ఐటీ రంగ షేర్లతోపాటు బ్లూచిప్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపర్ల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు మద్దతు లభించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,533.72 పాయింట్లు లేదా 2.11 శాతం పుంజుకుని 74,315.61 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 1,548.40 పాయింట్లు ఎగబాకింది. ఇక నిఫ్టీ కూడా 374.65 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి 22,997.35 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలకు బ్రేకులు పడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ రేటు 2.34 శాతం పడిపోయి 103.60 డాలర్లకు దిగొచ్చింది.

# పేదల కళ్లల్లో వెలుగులు నింపడమే సుంకిరెడ్డి లక్ష్యం

**కడ్తల్‌లో 154 మంది కంటి శుక్లాల బాధితులకు పునః సమీక్ష శస్త్రచికిత్సల అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన శంకర నేత్రాలయ వైద్య బృందం**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తల్ పట్టణంలోని ఎంబీఏ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి చెన్నై నుంచి వచ్చిన శంకర నేత్రాలయ ప్రముఖ వైద్య బృందం హాజరై, శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగుల కంటి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించింది. శస్త్రచికిత్స అనంతరం రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వైద్యపరంగా పాటించాల్సిన సూచనలు, సలహాలను అందించింది. శస్త్రచికిత్సలతోనే సేవలు ముగియవు.. అనంతర వైద్య పర్యవేక్షణకూ ప్రాధాన్యం పేద ప్రజలకు నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే సంకల్పంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఐక్యత ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలను చేపడుతోందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా కంటి శుక్లాలతో బాధపడుతున్న 154 మందికి విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తయ్యాయని వెల్లడించారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని మరోసారి వైద్యుల ద్వారా పరిశీలించి, అవసరమైన వైద్య సూచనలు అందించాలనే ఉద్దేశంతో పునః సమీక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిన్న, ఈరోజు రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. రోగులకు శస్త్రచికిత్సలు చేయించడం మాత్రమే కాకుండా, ఆ తర్వాత కూడా వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వైద్యుల ద్వారా పర్యవేక్షణ అందించడం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవా దృక్పథానికి నిదర్శనమని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భారం కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉచిత వైద్యం, కంటి అద్దాలతో పేదలకు ఎంతో మేలు ఈ సందర్భంగా కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న కంటి శుక్లాల శస్త్రచికిత్సలను ఉచితంగా చేయించడంతో పాటు, శస్త్రచికిత్స అనంతరం పునః సమీక్ష నిర్వహించడం, ఉచితంగా కంటి అద్దాలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా మెరుగైన వైద్య సేవలు పొందలేని తమకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. తమ కంటి ఆరోగ్యాన్ని మరోసారి పరీక్షించి, అవసరమైన సూచనలు అందించిన వైద్య బృందానికి, ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం సమాజంలోని పేద, అవసరంలో ఉన్న ప్రజలకు ఆరోగ్య సేవలు చేరువ చేయడమే ఐక్యత ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని సభ్యులు తెలిపారు. కంటి వైద్య శిబిరం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులకు తదుపరి వైద్య పర్యవేక్షణ అందించడం ద్వారా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తల్లోజు రఘు, ఎగిరిశెట్టి లింగం, చెన్నై శంకర నేత్రాలయ వైద్య బృందం, కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ చేయూత



**ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద కుటుంబానికి సిమెంట్ అందజేత**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని మర్రిగుంత తండా గ్రామ పరిధిలోని కొత్త తండాలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో సిమెంట్ అందజేశారు.

కొత్త తండాకు చెందిన ఇస్లావత్ దేవుసింగ్ తండ్రి భీచ్యకు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు అవసరమైన సిమెంట్‌ను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి ఈ సహాయం కొంతమేర తోడ్పడనుంది. పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, వారి కష్టాల్లో భాగస్వాములవడం లక్ష్యంగా ఉప్పల వెంకటేష్ సహకారంతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**పేద కుటుంబాలకు అండగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్**

సామాజిక సేవే లక్ష్యంగా ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ఆర్థికంగా, సామగ్రి రూపంలో తోడ్పాటు అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని అందించడం ద్వారా వారి సొంత ఇంటి కల సాకారమయ్యేందుకు సహకారం అందిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇస్లావత్ విజేష్ నాయక్, భాస్కర్ నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు..**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది.

**భక్తిశ్రద్ధలతో సత్యసాయి సేవా సమితి భజనలు**

ఉదయం సత్యసాయి సేవా సమితి భక్తులు భజనలు చేస్తూ ఆలయానికి విచ్చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి గీతాలు ఆలపించారు. వారి భజనలతో ఆలయ ప్రాంగణం భక్తిరసంతో మార్మోగింది. భక్తులు భజనల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. చిన్నారులను ఆకట్టుకున్న మ్యాజిక్ షో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మ్యాజిక్ షో చిన్నారులతో పాటు మహిళలను విశేషంగా ఆకట్టుకుంది. వినోదభరితమైన ప్రదర్శనను చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. ప్రతిరోజూ భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న విభిన్న కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు**

సాయంత్రం స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, దసరా పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ చేసిన ప్రత్యేక ప్రదర్శనలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చాటిచెప్పేలా చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని తిలకించిన భక్తులు చిన్నారులను అభినందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎంపీ రాములు దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎంపీ రాములు వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వాటిని భావితరాలకు అందించాలని కోరారు. పండుగలు సమాజంలో ఆధ్యాత్మిక భావనను, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాజీ ఎంపీ రాములును శాలువాతో ఘనంగా సత్కరించారు. భక్తులకు నిరంతర అన్నదాన సేవలు నవరాత్రి ఉత్సవాలకు విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు తెలిపారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా సుమారు 3,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు వెల్లడించారు. భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉందని, ఉత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.





**పలువురు ప్రముఖులు, కమిటీ సభ్యుల భాగస్వామ్యం**

ఈ నవరాత్రి ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, పానుగంటి నవీన్, కోశాధికారులు గుబ్బ కిషన్, వాస మనీష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ బాదం రాఘవేందర్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాసా శేఖర్, చిగుళ్లపల్లి శ్రీధర్, గుగ్గిల శంకర్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు మౌనిక, కల్మిచర్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

దుర్గా భవాని యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా భవాని అమ్మవారిని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమశీలో, మాజీ ఎంపీపీ చెదురుపల్లి వెంకటయ్య గౌడ్, పోతేపల్లి సర్పంచ్ కొండల్ యాదవ్ జూపల్లి సర్పంచ్ అనూష జగపతి, మాజీ సర్పంచ్ పాలాది మల్లీశ్వరి బాలరాజు, భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండీ సిరాజ్, గ్రామ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో సుఖసంతోషాలు, సౌభాగ్యం, శాంతి నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి.. లేదంటే డబ్బులు వాపస్ ఇవ్వండి




**ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు వెంటనే మీటర్లు మంజూరు చేయాలని, లేదంటే వారు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న పేదలు మీ-సేవ ద్వారా విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నా, నెలలు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దరఖాస్తు సమయంలో వేలాది రూపాయలు చెల్లించినప్పటికీ కనెక్షన్లు మంజూరు చేయకపోవడం, చెల్లించిన సొమ్మును తిరిగి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. సింగరేణి స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో విద్యుత్ కనెక్షన్ల విషయంలోనూ సానుకూలంగా స్పందించాలని కోరారు. వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గాంధీనగర్‌లో ఘనంగా అన్నదానం

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**



దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా గాంధీనగర్‌లోని ఎన్ఎస్‌బీ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భవానీ మాలధారణ భక్తులతో పాటు సాధారణ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ 50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్, మరో కార్పొరేటర్ ఎం.ఏ. ఫజల్ బేగ్ హాజరై భక్తులకు అన్నదానం చేశారు. పండుగల వేళ ఇటువంటి సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మిక భావనతో పాటు సేవాస్ఫూర్తి, సోదరభావాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. అన్నదానానికి సహకరించిన ఆటో దేవయ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌బీ యువజన సంఘం సభ్యులు, భవానీ భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ స్వచ్ఛ జలధార

**కల్వకుర్తి పట్టణంలో తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన "స్వచ్ఛ జలధార" కార్యక్రమం మూడవ విడతలో భాగంగా గురువారం కల్వకుర్తి పట్టణంలోని మున్సిపాలిటీ 3వ వార్డులో తాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో తాగునీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేశారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, ఇతర వ్యర్థాలను ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి, శాస్త్రీయ పద్ధతుల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. తాగునీటి నిల్వ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే లక్ష్యంతో ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశలవారీగా కార్యక్రమం ప్రజారోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు ఎంతో కీలకమని భావిస్తూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో దశలవారీగా నిర్వహించనున్నారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందేలా అవసరమైన చర్యలకు సహకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ రాము నాయక్, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు శ్రీను నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు శంకర్, తిరుపతి, రాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల ఐక్యత ముందు ఏ శక్తీ నిలవదు

**సింగరేణి సింహ గర్జన సభ విజయంపై**
**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

కార్మికుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన 'సింగరేణి సింహ గర్జన' సభను విజయవంతం చేసిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కోల్‌బెల్ట్ ప్రజలకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) తరపున మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత మూడేళ్లలో తొమ్మిది మెడికల్ బోర్డులు నిర్వహించి, 51 మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారని ఆరోపించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికులను సైతం విధులకు పంపుతున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో బొగ్గు ఉత్పత్తి తగ్గుతోందని, నిర్వహణ లోపాలు సంస్థపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. కార్మికుల ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం లాభాల వాటాను ప్రకటించిందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతోపాటు కార్మికుల హక్కుల సాధనకు బీఆర్ఎస్, టీబీజీకేఎస్ కట్టుబడి ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కోలేటి దామోదర్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## జూనియర్ సివిల్ జడ్జి గా సాయి పవన్



**అగ్నిధారన్యూస్ హనుమకొండ జిల్లా**

భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన డ్యాగల సారయ్య సత్యవతి కుమారుడైన డ్యాగల సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జి సాధించి తల్లి తండ్రులతో పాటు చదువు చెప్పిన గురువులకు పేరు తెచ్చి పెట్టారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత న్యాయ వ్యవస్థపై మక్కువతో సమాజంలోని చెడును చట్టపరంగా తుడిచి వేయడంతో పాటు సామాన్యునికి న్యాయం అందేలా, నేరాలను అదుపు చేయడం కోసం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఐ ఐ టి కరగ్ పూర్ లో ఎల్ ఎల్ బి హానర్స్ పూర్తి చేసిన సాయి పవన్ కొంత కాలం డిల్లీ హై కోర్టు, తీస్ హజారి జిల్లా కోర్టు, హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూనే జూనియర్ సివిల్ జడ్జి సాధించాలని పట్టుదలతో మూడు సార్లు పరీక్షలు వ్రాసి జూనియర్ సివిల్ జడ్జి పదవి సాధించాడు. నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసు శాఖ విడుదల చేసిన ఎ.పి.పి ఫలితాల్లో కూడా పదవిని సాధించాడు. సాయి పవన్ తండ్రి విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడుతో పాటు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సాయి పవన్ నియామకం పట్ల తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు ముద్దసాని సహోదర రెడ్డి, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర కమిటి సభ్యులు జన్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, సహచర న్యాయవాదులు నారాయణరావు, ఇ. సత్యనారాయణ రెడ్డి, బండి మొగిలి ఎం. శ్రీనాథ్, చింత నిఖిల్, జన్ను ప్రభాకర్, సన్నీ కుమార్, రాహుల్, లోకేశ్వర్ తదితరులు అభినందనలు తెలిపారు

## రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ విడిపోయి 12 ఏళ్లు దాటింది. అయిన రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు మాత్రం ఇప్పటికీ అలాగే ఉండిపోయాయి. ఇవి నిత్యం రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. తాజాగా రెండు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. అయితే, చంద్రబాబు ప్రతిపాదనపై తెలంగాణలో అనేక సందేహాలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధంగా రావాల్సిన వాటిని పక్కనపెట్టి, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలనే చంద్రబాబు ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇటీవల జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించారు. పెండింగ్లో ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి ఉమ్మడి రాష్ట్ర నాయకత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. అయితే, దీనిని తెలంగాణ ప్రభుత్వం కేవలం కాలయాపన కార్యక్రమంగా చూస్తోంది. అంతేకాక, ఏపీకి అనుకూలంగా చట్టాన్ని మార్చే ప్రయత్నంగా అనుమానిస్తోంది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని, లొకేషన్ ఆధారంగా ఆస్తుల విభజన జరగాలని తెలంగాణ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఈ విభేదాల వెనుక బలమైన రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయి. షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనలో, అలాగే చట్టంలో ప్రత్యేకంగా పేర్కొనని సంస్థల విషయంలో గతంలోనే తమకు అనుకూలంగా కొన్ని నిర్ణయాలు వచ్చాయని తెలంగాణ వాదిస్తోంది. ఇప్పుడు 'గివ్ అండ్ టేక్' పేరుతో వాటిని తప్పిస్తారని తెలంగాణ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు.. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులకు సంబంధించి పబ్లిక్ డెట్ విభజనలో జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలని విభజన చట్టం స్పష్టం చేసింది. అయితే.. ఏపీ మాత్రం లొకేషన్, యుటిలైజేషన్, జనాభా ప్రాతిపదికన వేర్వేరు పద్ధతులను ప్రతిపాదించిందని తెలంగాణ ఆరోపిస్తోంది. ఈ వివాదం కేవలం అధికారుల స్థాయికే పరిమితం కాకుండా రాజకీయ వేడిని రాజేసింది. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరించి, తెలంగాణ నుంచి రావాల్సిన మొత్తాన్ని రికవర్ చేయాలని ఆదేశించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చట్ట నిబంధనలను దాటి 'గివ్ అండ్ టేక్' ముసుగులో ఏపీ ఆర్థికంగా లబ్ది పొందాలని చూస్తోందని తెలంగాణ గట్టిగా వాదిస్తోంది. మొత్తంగా చూస్తే.. రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ఈ విభజన అంశాలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. చట్టం ప్రకారం హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ భావిస్తోంది. అదే సమయంలో పరస్పర అంగీకార మార్గాలను అన్వేషించాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. మరి ఈ ప్రతిష్టంభన రాబోయే రోజుల్లో ఏ రాజకీయ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

## హైదరాబాద్ మెట్రో అనాథ !

**హైదరాబాద్ :** దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, వ్యాపార హబ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం.. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ విషయంలో మాత్రం ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే వెనుకబడిపోతోంది. ఢిల్లీ 390 కిలోమీటర్లకు పైగా ట్రాక్‌తో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు వేల కోట్ల కేంద్ర నిధులతో తమ రెండో, మూడో దశ పనులను శరవేగంగా పట్టాలెక్కిస్తున్నాయి.

## గోదావరిఖనిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం)**

గోదావరిఖనిలోని గంగానగర్ మిలీనియం క్వార్టర్స్‌లో గోల్డీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దుర్గామాత ఆలయం వద్ద జరిగిన ఈ వేడుకలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతిబింబమని పేర్కొన్నారు. సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకలను ఘనంగా నిర్వహించిన గోల్డీ ఈవెంట్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కే. శంకర్, ప్రతాపరెడ్డి, చందర్‌రావు, లింగయ్య, భవానీ కమిటీ సభ్యులు, లింగమూర్తి, నాని, అశోక్, మహేశ్, రాజగోపాల్, శ్రావణ్, విక్రమ్, రాజుసింగ్, నాగార్జున, సోనూ, సాయి, అభి, నిఖిల్, సందీప్, అరుణ్, బంటి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా దాడుల వ్యతిరేక కమిటీ కో-కన్వీనర్ సురభి శ్రీధర్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**



వార్తా కథనాలు ప్రచురించినందుకు 'ఏక్ దమ్ న్యూస్' జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌పై పోలీసులు దాడి చేసి, థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిపించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు సంబంధిత పోలీసులను సస్పెండ్ చేసి, క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాల దృశ్యాలు, అరెస్టు రికార్డులు, వైద్య నివేదికలు వంటి కీలక ఆధారాలను భద్రపరచాలని, బాధితులకు రక్షణ కల్పించి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మల్లావర్జుల వంశీవిద్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పి. విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్, టి.కె. శ్రీనివాస్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యుడు సామల హరికృష్ణ, జిల్లా దాడుల వ్యతిరేక కమిటీ కన్వీనర్ చింతకింది చంద్రమొగిలి, కో-కన్వీనర్ సురభి శ్రీధర్, జిల్లా ఎథిక్స్ కమిటీ కన్వీనర్ పోతరాజు సమ్మయ్య హెచ్చరించారు.

## లింగాపూర్‌లో మెగా లెదర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అంబేద్కర్ యువజన సంఘం వినతి**

**అగ్ని ధార న్యూస్ ( రామగుండం):**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామ శివారులో మెగా లెదర్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఎస్సీ ఉపకులాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. గురువారం ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. 25 ఏళ్ల క్రితం లింగాపూర్ శివారులోని సర్వే నంబర్లు 132, 134లో లెదర్ పరిశ్రమ కోసం 25 ఎకరాల భూమి కేటాయించినా, ఇప్పటివరకు పరిశ్రమ ఏర్పాటు కాలేదని వివరించారు. ప్రస్తుతం 10 ఎకరాల భూమి కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుముఖత వ్యక్తం చేస్తూ లేఖ ఇచ్చినట్లు తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే సుమారు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస రాజేష్, నాయకులు పానుగంటి రాజలింగం, అక్కపాక రమేష్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



## కలాం జయంతి సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పండ్ల పంపిణీ



**అగ్ని ధార న్యూస్ ,(రామగిరి):**

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబంలో జన్మించిన కలాం తన ప్రతిభ, పట్టుదలతో దేశం గర్వించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. అంతరిక్ష పరిశోధన, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని, యువతకు ఆయన జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మెరుగు శ్రీకాంత్, సెంటనరీ కాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవే



**ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు: కేటీఆర్**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, వారి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై పార్టీ తరపున అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలను వివరించారు. ఉద్యోగుల సమస్యలను విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రావు, అధికార ప్రతినిధి డాక్టర్ బోడ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా బాధ్యుడు వినయ్‌కుమార్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలపై విచారణ.. బాధ్యులపై చర్యలు



**అగ్ని ధార న్యూ ,(హైదరాబాద్):**

కార్మిక శాఖ సంక్షేమ పథకాల పరిహారం కోసం నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. విచారణ నివేదిక ఒకటి, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. క్లెయిమ్‌ల పరిశీలన, ప్రాసెసింగ్ బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. పరిహారం అందలేదని ఓ వ్యక్తి ఇచ్చిన దరఖాస్తును పరిశీలించాలని మాత్రమే అధికారులకు లేఖ రాశానని, మంజూరు చేయాలని సిఫార్సు చేయలేదని వివరించారు. విచారణ అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వార్తలను వాస్తవాలు ధ్రువీకరించుకున్న తర్వాతే ప్రచురించాలని సూచించారు.

## గోదావరిఖనిలో ఘనంగా ధమ్మచక్ర ప్రవర్తన దినోత్సవం

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**



పట్టణంలోని స్థానిక చౌరస్తా వద్ద ఉన్న స్ఫూర్తి భవనంలో బుధవారం సాయంత్రం ధమ్మచక్ర ప్రవర్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అంబేద్కర్ అభిమానులు, బౌద్ధులు మాట్లాడుతూ.. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లక్షలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. బుద్ధుడి బోధనలు, అంబేద్కర్ ఆశయాలు సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలకు మార్గదర్శకమని తెలిపారు. ధమ్మచక్ర ప్రవర్తన దినోత్సవం సందర్భంగా బౌద్ధ భారతీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాస రాజయ్య, సాంబోజు మల్లయ్య, బడికల కృష్ణ, బీఎస్పీ సీనియర్ నాయకుడు మారపెల్లి రవికుమార్, కాసిపేట స్వామి, కల్లేపల్లి మల్లేశ్, జింకా భాస్కర్, జనగాం మల్లేశ్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పులి నేపథ్యంలో సాగే కథతో?

మెగా హీరో సాయిదుర్గతేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమా చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత 'సేవ్ ది టైగర్స్'ఫేం తేజ కాకుమాను దర్శకత్వంలో సాయిదుర్గతేజ్ ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఇటీవలే క్లాప్ కొట్టారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నది. 'కాంతార'ఫేం సప్తమి గౌడ ఈ సినిమాలో కథానాయికగా ఖరారైంది. ఇదిలావుంటే.. ఈ సినిమా కథాంశం విషయంలో ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. అటవీ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పులి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందట. అందుకే.. పులికి సంబంధించిన సన్నివేశాలను ప్రీ విజువలైజేషన్ చేశారట. భారీ స్థాయిలో సీజీ వర్క్ అవసరమైన సినిమా ఇదని సమాచారం. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసిన తర్వాతే సెట్స్ పైకి వెళ్లాలని దర్శకుడు తేజ కాకుమాను ఫిక్స్ అయ్యారట. ఈ నెలాఖరునే తొలి షెడ్యూల్ మొదలవుతుందని తెలిసింది. తమన్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## మూవీ లవర్స్‌కు గుడ్ న్యూస్..

# వైజాగ్‌లో చిరంజీవి నయా ప్లాన్..!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. విశ్వంభర, కాకా సినిమాతోపాటు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడు. కాగా చిరుకు సంబంధించిన ఆసక్తికర వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. త్వరలోనే చిరంజీవి ఫిల్మ్ ఎగ్జిబిషన్ బిజినెస్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఏసియన్ సినిమాస్‌తో కలిసి హైదరాబాద్‌కు ఔశీతీశ్రీс'ం ఘుతీస్త్రవర్ ూఎతీవవఅ (ప్రపంచ అతిపెద్ద థియేటర్)ను తీసుకురాబోతున్నాడు. అంతేకాదు ఏపీలోని విశాఖపట్నం కొత్త మల్టీ స్క్రీన్ థియేటర్‌ను నిర్మించాలనే ప్లాన్ కూడా చేస్తున్నాడట. గరివిడి లక్ష్మి మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు ఈ వార్తను షేర్ చేశారు. చిరంజీవితో గంటా శ్రీనివాస్ రావుకు మంచి అనుబంధం ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇటీవలే గంటా శ్రీనివాస రావు చిరంజీవిని కలవగా.. వైజాగ్‌లో న్యూ మల్టీప్లెక్స్ థియేటర్ విషయం తెరపైకి వచ్చింది. చిరంజీవికి కెరీర్ తొలినాళ్ల నుంచి వైజాగ్‌తో చాలా అటాచ్‌మెంట్ ఉందని తెలిసిందే. ఈ నేపథ్యంలో వైజాగ్‌లో మల్టీప్లెక్స్ నిర్మించేందుకు ప్లాన్ చేయడం అక్కడి అభిమానులకు శుభవార్తే అని చెప్పాలి.

## ముగ్గురు హీరోయిన్లతో.. సందీప్ కిషన్



హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కరికాల' ఘనంగా ప్రారంభమైంది. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. భారీ ఊహా ప్రపంచం నేపథ్యంలో రెండు భాగాలుగా రూపొందనున్న ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమంతో ఈ సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు ఆది సాయి కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

**కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా..**

ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ.. 'కరికాల' కథను రెండు భాగాలుగా చెప్పినా ఎక్కడా బోర్ అనిపించలేదని తెలిపారు. గత ఆరు, ఏడు నెలలుగా దర్శకుడు యుగంధర్ ముని ప్రీ ప్రొడక్షన్ కోసం ఎంతో కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఉత్తమ చిత్రంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు.

**తేదీలు ఖరారు**

'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మేకర్స్ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలి భాగం 2027 జూలై 2న, రెండో భాగం అదే ఏడాది అక్టోబర్ 28న విడుదల కానుంది. సందీప్ కిషన్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటిస్తుండటం, నాగలోకం, వానర లోకం వంటి విభిన్న నేపథ్యాలు ఉండటం ఆసక్తిని పెంచుతున్నాయి.

# పెళ్లికి ఇంకా టైముంది!



గత కొన్నేళ్లుగా సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నది మలయాళీ సోయగం అనుపమ పరమేశ్వరన్. మహిళా ప్రధాన చిత్రాలతో పాటు ప్రధానస్రవంతి చిత్రాల్లో కథానాయికగా రాణిస్తూ సత్తా చాటుతున్నది. తాజాగా ఈ భామ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నది. తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, వీకే నరేష్ ప్రధాన పాత్రల్లో భద్రప్ప గాజుల దర్శకత్వంలో బూసం జగన్‌మోహన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం అనుపమ పరమేశ్వరన్ విలేకరులతో సినిమా సంగతుల్ని పంచుకుంది. ఈ సినిమాలో తాను స్వతంత్ర్య భావాలు కలిగిన కీర్తి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇదని పేర్కొన్నది. ఆమె మాట్లాడుతూ 'తెలంగాణ పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం వినోదప్రధానంగా సాగే చిత్రమిది. మా కేరళ వివాహ వేడుకల్లో పూర్తిగా శాకాహారమే వడ్డిస్తారు. కానీ తెలంగాణ పెళ్లిలో నాన్‌వెజ్ పెడతారని ఈ సినిమా ద్వారానే తెలుసుకున్నా. ఈ కథలో పాత్రలన్నీ స్ట్రగుల్ పడుతుంటాయి. కానీ వాళ్ల కష్టాల నుంచే మంచి కామెడీ పుడుతుంది' అని చెప్పింది. పెళ్లెప్పుడు చేసుకుంటారనే ప్రశ్నకు జవాబిస్తూ 'నా పెళ్లి విషయంలో మా పెరెంట్స్ నుంచి ఎలాంటి ఒత్తిడిలేదు. ఇష్టమైనప్పుడు చేసుకో అంటున్నారు. నా పెళ్లికి ఇంకా టైముంది అనుకుంటున్నా' అని చెప్పింది. 'క్రేజీ కల్యాణం'లోని కీర్తి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని, ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నానని, అవన్నీ వేటికవే విభిన్నమైన పాత్రలని అనుపమ పరమేశ్వరన్ చెప్పింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com